క్లుప్తంగా

వినతులపై నిర్లక్ష్యం వద్దు


వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వస్తున్న వినతులు, సమస్యలపై నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. ఇందులో రెవెన్యూ, పింఛన్, పారిశుధ్యానికి సంబంధించి పలు ఫిర్యాదులు అందాయి. అధికారులతో మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వస్తున్న సమస్యలను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని ఆదేశించారు.

డ్రైవర్ల సమస్యలపై వినతి


కలెక్టర్‌ను కలిసిన డ్రైవర్ల సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షుడు శ్రీనివాసన్ కోరారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవితో కలిసి జిల్లా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జేసీ విద్యాధరిని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ప్రభుత్వ డ్రైవర్లకు విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థలో ఎల్ఎంవీ డ్రైవర్లుగా పనిచేస్తున్న నలుగురు ఉద్యోగోన్నతికి అర్హత కలిగి ఉన్నారన్నారు. అయితే ఆ డ్రైవర్లు కమిషనర్ ను కలిసి పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘ నాయకులు నాగరాజు, అన్బు పాల్గొన్నారు.

డీలర్లు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలి

చిత్తూరు కార్పొరేషన్: డీలర్లు తమ జీఎస్టీ నంబర్లకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్‌సన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం డీలర్లు జీఎస్టీ నంబర్లకు ఆధార్ అనుసంధానం చేయాలని ఆదేశించిందన్నారు. వీటిపై ఇప్పటికే వ్యాపార సంఘాలు, ట్రేడర్లకు సమాచారం ఇచ్చామన్నారు. ఇంకా చేసుకోని వారు ఉంటే ఇకనైనా చేసుకోవాలని సూచించారు.


కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్



చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న అశోకన్ (56) అనే నిందితుడిని చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ శ్రీహరిరెడ్డి కథనం మేరకు.. సోమవారం గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం రోడ్డులోని ముసలయ్యగారిపల్లె కూడలి వద్ద పోలీసులు తనిఖీలు చేశారు. చిన్నవేపంజేరికి చెందిన అశోకన్ తన ద్విచక్రవాహనంలో ఓ సంచి తీసుకెళుతుండగా ఆపి, సోదా చేశారు. ఆ సంచిలో కర్ణాటకకు చెందిన 48 టెట్రా మద్యం ప్యాకెట్లు గుర్తించారు. వాహనంతోపాటు మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఇతనిపై కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టి, ఆయన ఆదేశాలతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు. ఈ దాడుల్లో ఎస్ఐ పృథ్వీరాజ్, సిబ్బంది శరవణ, దినకరన్, సంధ్య పాల్గొన్నారు.

ఎద.. తప్పితే వ్యథ!

పాడి రైతులు ఎదకు వచ్చిన పశువులను గుర్తించలేకపోతే క్రమంగా వాటిలో పునరుత్పత్తి స్థాయి తగ్గిపోతుందని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. సాధారణ ఎద, మూగ ఎద అనే రెండు రకాలు ఉంటాయి. సాధారణ ఎదను అందరూ గుర్తించగలరు. అయితే మూగ ఎదకు వచ్చిన పశువులను గుర్తించడం కష్టం. మూగ ఎద లక్షణాలను తెలుసుకుని ఆ పశువులకు సకాలంలో గర్భ నిర్ధారణ టీకా వేయించాలి. ప్రధానంగా పశుపోషణపై ఆధారపడి జీవించే రైతులు వీటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని లేకుంటే నష్టపోతారని వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు.



- పాడి పశువుల్లో ఎద గుర్తించకుంటే నష్టం
- ఆవుల్లో పునరుత్పత్తి తగ్గుదల
- ఏమరుపాటుగా ఉంటే పాడి రైతులకు తీరని నష్టం

తవణంపల్లె: రైతుల్లో 90 శాతం మంది పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పాడి పునరుత్పత్తిలో అత్యంత కీలక అంశం ఎద. ఈ విషయాన్ని గుర్తించడంలో పాడి రైతులకు ఎంతైనా అవగాహన అవసరం. పాడి పశువుల్లో ఈస్ట్రోజన్ అనే హార్మోను ఉత్పత్తి కావడం వలన పశువులు చూపే లక్షణాలను ఎద అంటారు. ఆవులు, గేదెలు ఏడాది పొడవునా ఎదకు వస్తుంటాయి. వాటిని పాలీ ఈస్టర్ అంటారు. ఎదకు వచ్చినప్పుడు పాడి పశువుల ప్రవర్తనలో బాహ్యజననేంద్రియ, అంతర బాహ్యజననేంద్రియ మార్పులు చోటు చేసుకుంటాయి. ఎద లక్షణాలు కనిపించకపోవడమే మూగ ఎద అంటారు. ఆడ పశువులు యుక్త వయసుకు వచ్చిన తర్వాత అండాశయంలో ఉత్పత్తి అయిన హార్మోన్ల ప్రభావంతో ఎద లక్షణాలు వ్యక్తమవుతాయి. వీటిని సకాలంలో గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయించాలి. ఇదే పునరుత్పత్తి యాజమాన్యంలో అత్యంత కీలకం. చాలా మంది రైతులు పాడి రైతులు ఆవుల ఎదను సకాలంలో సరిగా గుర్తించక నష్టపోతున్నారు. పశువులను పోషించే ప్రతి పాడి రైతులు వాటి ఎద లక్షణాలను ఎలా గుర్తించాలో తెలుసుకొని అవగాహన పెంపొందించుకోవాలి.

పశువుల్లో మామూలు ఎద లక్షణాలు

మండలంలో 12,346 పశువులు ఉన్నాయి. ఆవుల్లో ఎద కాలం 18 నుంచి 24 గంటలు ఉంటుంది. గేదెల్లో 24 నుంచి 36 గంటల వరకు ఉంటుంది

పశువు ప్రవర్తనలో మార్పులు: చికాకుగా ఉంటుంది. ఆకలి మందగించి వేరు పడుతుంది. ఇతర పశువుల మీదకి ఎగబాకుతూ, నాకుతూ ఉంటుంది. ఉద్రేకం కలిగి ఉండడంతో పాటు పాల ఉత్పత్తి తగ్గుతుంది. తోక పైకి ఎత్తుకొని తిరుగుతుంది.

బాహ్యజననేంద్రియాల్లో మార్పులు: కచ్చ పెదవులు ఉబ్బి ఉంటాయి. మానం లోపలి భాగం ఎర్రగా ఉంటూ తీగలు, తీగలుగా వేస్తుంది. తోక, తొడలపై ఆ తీగలు అంటుకొని ఉంటాయి.

పశువు అంతర జననేంద్రియాల్లో మార్పులు: సర్విక్స్ ముఖ ద్వారం తెరుచుకొని, గర్భాశయం, గర్భాశయ భాగాలు టోనిసిటీని కలిగి ఉంటాయి.

పశువుల్లో మూగ ఎద లక్షణాలు

పశువుల్లో ఎద లక్షణాలు కనిపించకుండా పోవడమే మూగ ఎద అంటారు. దీనిని పాడి రైతులు గుర్తించడం కష్టంగానే ఉంటుంది. గేదెలు 60 శాతం మూగ ఎదలోనే ఉంటాయి. ఎద సమయంలో కీచుగా అరవడం, పశువులను, మనుషులను బెదురుగా చూడడం వంటి లక్షణాలు ఉంటాయి. వీటిని సులభంగా గుర్తించవచ్చు. పశువుల్లో ఎద లక్షణాలు కనిపెట్టకపోవడం వల్లే పునరుత్పత్తి తగ్గుతోంది. పాడి ఆవులు 25 రోజులకు ఒక సారి ఎదకు వస్తాయి.

గేదెల్లో ఎద లక్షణాలు

గేదెల్లో ఎద లక్షణాలు 24 నుంచి 36 గంటల పాటు ఉంటాయి. గేదె చిరాకుగా ఉండి మేత తినడం మానేస్తుంది. గేదెలు తరచూ మూత్రవిసర్జన చేస్తుంటాయి. గేదెలు ఎక్కువగా ఆగస్టు నుంచి మార్చి నెలల్లో ఎదకు వస్తాయి. గేదెల్లో అస్పష్టంగా ఉన్న మూగ ఎద లక్షణాలను గమనించడానికి పోషకులు చాలా శ్రద్ధ చూపాలి. గేదె అసాధారణ మార్పును బట్టి ఎదను గుర్తించవచ్చు.


తవణంపల్లెలో పాడి ఆవుకు గర్భనిర్ధారణ చేస్తున్న పశువైద్యాధికారి

పశువుల్లో ఎదను జాగ్రత్తగా గమనించాలి



పాడి పశుపోషకులు పశువులు ఎదకు వచ్చినప్పుడు జాగ్రత్తగా గమనించి వాటికి కృత్రిమ గర్భధారణ చేయించాలి. ఆలస్యమైన తర్వాత ఎదకు వచ్చే వరకు వేచి ఉండాలి. దీని వల్ల పునరుత్పత్తి తగ్గిపోతుంది. మండలంలో 12,346 పశువులు ఉన్నాయి. పాడి రైతులకు ఎదకు వచ్చినప్పుడు ఎలా గుర్తించాలో అవగాహన కల్పిస్తున్నాం. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ లావణ్య, పశువైద్యాధికారి, తవణంపల్లె

ఎదకు వచ్చిన వెంటనే..



నేను కొన్నేళ్లుగా పశుపోషణలో ఉన్నాను. ప్రస్తుతం సుమారు 30 పాడి ఆవులను మేపుతున్నాను. మొదట్లో మాత్రమే పశువులు ఎదకు వచ్చినప్పుడు గుర్తించలేదు. ఆ తరువాత ఆవులు ఎదకు వచ్చిన వెంటనే గుర్తిస్తాను. నిర్ధారణ చేసుకున్న వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించి, గర్భధారణ టీకా వేయిస్తాను. ఇప్పటివరకు ఎదకు వచ్చిన ఆవులన్నీ ఇప్పుడు చూలుగా ఉన్నాయి.

–యుగంధర్ రెడ్డి, పాడి రైతు, ఎగువ తవణంపల్లె

ఏఈ కక్ష సాధింపులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చిత్తూరు కలెక్టరేట్ : నగర ఆర్టీసీ 2 డిపో మెకానిక్ ఏఈ అరుణకుమారి కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆ డిపో ఆర్టీసీ గ్యారేజీ కార్మికులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ గ్యారేజీ కార్మికులను విజిలెన్స్ సిబ్బందిని కక్షసాధింపు దిశగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ధోరణికి నిరసనగా ఆరు నెలల క్రితం విధులు మానేసి గ్యారేజీ ఎదుట ధర్నా చేసినట్లు తెలిపారు. అప్పటి డీపీటీవో కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వగా ధర్నా విరమించుకుని విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. అయితే ఆ అధికారిణి వైఖరి ఏ మాత్రం మారలేదన్నారు. రేయింబవళ్లు కష్టపడి పనిచేస్తున్న డిపో కార్మికుల పట్ల వేధింపులకు పాల్పడితే ఎలా ఉద్యోగాలు చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.

వరసిద్ధుని సేవలో టీటీడీ మాజీ చైర్మన్


స్వామి వారి చిత్రపటం అందుకుంటున్న టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సోమవారం మాజీ టీటీడీ చైర్మన్ బాపిరాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన గణపయ్య దర్శనార్థం విచ్చేయగా ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేద ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదం తదితరాలను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, చిట్టిబాబు, ఎస్ఐ ధరణి ధర ఉన్నారు.

ఆలకించండి.. న్యాయం చేయండి


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ విద్యాధరి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కిరణ్

చిత్తూరు కలెక్టరేట్: తమ సమస్యలను పరిష్కరించి, న్యాయం చేయండి సారూ అంటూ పలు ప్రాంతాలకు చెందిన అర్జీదారులు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, జేసీ విద్యాధరికి అర్జీలు అందజేసి న్యాయం చేయాలని కోరారు.

మరో ప్రాణం పోకుండా చూడండి

తన బిడ్డ లాగా మరోబిడ్డ ప్రాణాలు కోల్పోకుండా చర్యలు చేపట్టాలని నగరానికి చెందిన కిరణ్ వినతి పత్రం అందజేశారు. ఈ నెల 16 వ తేదీన మెసానికల్ మైదానం సమీపంలో ట్రాక్టర్ ఢీకొని 2వ తరగతి చదివే బాలుడు జైనిరూప్ మృతి చెందాడు. ఈ ఘటన లాగా మరో ప్రమాదం చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆ బాలుడు తండ్రి కిరణ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. భారీ వాహనాలు అటువైపు వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. శాశ్వతంగా స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. మెసానికల్ మైదానం వైపుగా వెళ్లే రోడ్డును విస్తరించాలని కోరారు. కిరణ్ కుటుంబ వివరాలు తెలుసుకున్న కలెక్టర్ ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

భూమి ఆక్రమించుకున్నారు



తన భూమిని ఆక్రమించుకున్నారని న్యాయం చేయాలని పులిచెర్ల మండలం రాయవారిపల్లెకు చెందిన సుబ్బయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రాయవారిపల్లెలో సర్వే నెంబర్ 151/11లో 2.75 ఎకరాల భూమి ఉందన్నారు. పట్టాదారు పాసుపుస్తకం సైతం తనపేరు మీద ఉందని చెప్పారు. ఆ భూమిలో పంటలు పండించుకుని జీవనం కొనసాగిస్తుండగా మరొక వ్యక్తి ఆక్రమించుకున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తనకు న్యాయం చేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి



గంగాధరనెల్లూరు మండలం వరత్తూరు గ్రామంలో శ్మశానానికి స్థలం కేటాయించాలని అర్జీదారుడు నాగరాజు కోరారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా చనిపోతే దహన క్రియలు చేసేందుకు స్థలం లేదని వాపోయారు. చాలా సంవత్సరాలుగా తమ గ్రామంలో ఈ సమస్య ఉందన్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి శ్మశానానికి స్థలం కేటాయించాలని కోరారు.

వితంతు పింఛన్ మంజూరు చేయండి



తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని పెద్దపంజాణి మండలానికి చెందిన పద్మావతి విన్నవించారు. చాలా నెలలుగా వితంతు పింఛన్ కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త మృతి చెందడంతో ఎలాంటి జీవనాధారం లేదన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి



అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూమిని కాపాడాలని యాదమరి మండలం ఆరిమాకులపల్లెకు చెందిన గీత కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ గ్రామంలో సర్వేనెం: 368/1లో 2.28 ఎకరాలు, 348/1లో 1.82 ఎకరాలు, 369/1లో 1.61 ఎకరాలు, 349/4 లో 1.02 ఎకరాలు, 356/1లోని 1.54 ఎకరాల భుత్వ భూమి అన్యాక్రాంతం అయ్యిందన్నారు. ఆ ప్రభుత్వ భూమిని కాపాడాలని కలెక్టర్ ను కోరారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఐరాల: ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత అన్నారు. మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 55 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతి నెలా వైద్యుల సూచనల మేరకు చెకప్ చేయించుకోవాలన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని మాధవరంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ రోగులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంట బీమాతో రైతులకు మేలు

తవణంపల్లె: మండలంలోని రైతులు సాగు చేసిన పంటలకు బీమా చేస్తే ఎంతో మేలు కలుగుతుందని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మురళీమోహన్ అన్ని ప్రభుత్వ శాఖల వారిగా మండలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్షించి సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విపత్తు సమయంలో రైతులను ఆదుకోవడానికి పంట బీమా పథకం ఎంతో దోహదపడుతుందని వివరించారు. పక్కా గృహాలు మంజూరుకు డిసెంబర్ నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. మండలంలో ఇరిగేషన్ చెరువులు, చెక్‌డ్యాంలు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ డిసెంబర్ నుంచి రేషన్‌కార్డులకు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని, మార్పులు, చేర్పులు కూడా చేసుకొనే అవకాశం ఇచ్చిందన్నారు. టి.పుత్తూరులో హెల్త్‌నెస్ సెంటర్‌కు కరెంటు లైన్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయాలని సర్పంచ్ రవిచంద్రారెడ్డి కోరారు. ఎ.గొల్లపల్లె పాఠశాల భవనం పనులు పూర్తి చేయాలని సర్పంచ్ కోరారు. సమావేశంలో ఎంపీడీఓ రెడ్డిబాబు, జెడ్పీటీసీ సభ్యులు భారతి, వైస్ ఎంపీపీ శోభారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

కార్తీక సోమవారం

- శివాలయాల్లో ఘనంగా దీపారాధన
- ఉసిరి చెట్టుకు మహిళల పూజలు
- మణికంఠేశ్వర స్వామికి రుద్రాభిషేకం


కాణిపాకం: మణికంఠేశ్వర స్వామి ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయమైనా శ్రీమణికంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారంతో కార్తీక సోమవార పూజలు ముగిశాయి. వేకువజామున మూలస్థానంలోని స్వామికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ప్రత్యేక అభిషేకంతో పాటు ఉసిరి, మారేడు చెట్టు కింద పిండి దీపాలను వెలిగించారు. మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మొగిలి శివాలయంలో..

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం భక్తి శ్రద్ధలతో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మొగిలి శివాలయానికి తరలివచ్చారు. ఆలయం ముందు మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలోని బిల్వచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి, ప్రదక్షిణలు చేశారు. కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా శివాలయాల్లో దీపారాధన చేశారు.

రాహుకేతు పూజలు

మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉదయం రాహుకాల సమయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజ కార్యక్రమాలను చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోష నివారణ పూజలు చేపట్టారు.



మొగిలి శివాలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు, రాహుకేతు పూజలు చేస్తున్న భక్తులు

వృక్ష కల్యాణం

- తులసి, ఉసిరి చెట్లకు పెళ్లి
- సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు
- ఊరేగింపుగా పట్టువస్త్రాల సమర్పణ


అశేష భక్తజనం మధ్య తులసి, ఉసిరి చెట్ల కల్యాణోత్సవం చేస్తున్న వేద పండితులు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో వెలసిన శ్రీ కోదండరాములు దేవస్థానంలో సోమవారం కార్తీక మాసం పురస్కరించుకొని వృక్ష కల్యాణం నిర్వహించారు. తులసి, ఉసిరి చెట్లకు సంప్రదాయబద్ధంగా చతుర్దశ వార్షిక కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉభయదారులు కల్యాణోత్సవానికి పూజాసామగ్రి, పట్టువస్త్రాలు, పూలదండలు, పండ్లు వివాహానికి అవసరమైన సరకులు ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు వేదమంత్రాలు పఠనం చేస్తూ తులసి, చెట్టుకు కల్యాణం నిర్వహించారు.

గోమాతకు పూజలు చేసిన భక్తులు

కోదండరామాలయంలో సోమవారం ఉదయం సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద గ్రామ ప్రజలు భక్తిప్రపత్తులతో గోమాతకు పూజలు చేసి, అరటి పండ్లు, గడ్డి తినిపించి మొక్కులు చెల్లించుకున్నారు. సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు చేసి మంగళవాయిద్యాలతో ఊరేగింపు చేశారు. వేదపండితులచే భగవద్గీత పారాయణం చేయించారు.

నేడు సుదర్శన హోమం

కార్తీక మాసం సందర్భంగా కోదండరామాలయంలో మంగళవారం ఉదయం యాగశాల ప్రవేశం, విష్వక్సేనారాధాన, పుణ్యాహవాచనం, అఖండదీపారాధన, చతుస్థానార్చన, మహాసుదర్శన హోమం, హనుమంతులారాధన, శ్రీరామనామాన్ని రాసిన తమలపాకులతో అర్చన, హనుమాన్ మూలమంత్ర హోమాలు, మన్యసూక్త హోమం, మహాపూర్ణాహుతి, మహానైవేద్యం ఉంటుందని ఆలయవంశపారంపర్య ధర్మకర్త పి. సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఉభయదారులు, గోమాతకు పూజలు చేస్తున్న మహిళా భక్తులు